
షాడో ఇన్
సిక్కిం
మధుబాబు
MVS
PUBLICATIONS

# షాడో ఇన్ సిక్కిం

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# షాడో ఇన్ సిక్కిం

ఫోమ్ బెడ్ మీద బద్ధకంగా అటూ ఇటూ దొర్లాడు షాడో.

టీ పాయ్ మీద టైంపీస్ పది గంటల పది నిముషాలు సూచిస్తోంది. దానివంక ఒకసారి అసహ్యంగా చూసి మళ్ళీ ముసుగు బిగించాడు.

బెడ్ రూమ్ అవతల కిచెన్ వుంది. అందులో బిందు బిజీగా వుంది కాబోలు –స్టీల్ సామాన్ల మోతలు వుండి వుండి వినిపిస్తున్నాయి.

పది నిముషాలసేపు శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు షాడో. నిద్రపట్టలేదు. విసుగ్గా వళ్ళు విరుచుకున్నాడు.

మరుక్షణం వెయ్యి కందిరీగలు కుట్టినట్లు _ అదిరిపడి లేచి కూర్చున్నాడు. ఆ బాధ పాత బాధలను జ్ఞప్తికి తెచ్చింది. పడిన పాట్లను గుర్తుచేసింది.

టీపాయ్ మీద పనామా పాకెట్ని అందుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు.

సంవత్సరంలో రెండుసార్లు రిఫ్రెష్మెంట్ ట్రయినింగ్కి అటెండ్ కావాలి సి.ఐ.బి. ఏజెంట్లు అందరూ.

కలకత్తాలో వుంది ఆ కాలేజీ. ప్రత్యక్ష నరకం అంటే ఎలా వుంటుందో అక్కడికిపోతే బాగా తెలిసివస్తుంది.

నెలరోజులపాటు అక్కడ వున్నాడు షాడో. ట్రైనింగ్ ముగిసిన మరుక్షణం ఢిల్లీ తిరిగి వచ్చేశాడు. వచ్చిన రెండు గంటలకే కులకర్ణిగారు కబురు పంపించారు.

"రాజూ! నీకు స్పెషల్ ట్రైనింగ్ యిప్పించమని పై నుంచి ఆర్డర్లు వచ్చాయి. యింకో గంటలో ప్రయాణానికి రెడీగా వుండాలి" సిగార్ పొగను రైలింజన్‌లా వదులుతూ అల్టిమేటమ్ యిచ్చారాయన.

బ్రతిమాలాడు షాడో. పడరాని పాట్లు పడ్డాడు. ఫలితం లేకపోయింది. కులకర్ణిగారి గుండెలు కరగలేదు. ఆయన యిచ్చిన గంట గడువూ, షాడో సి.ఐ.బి. హెడ్‌క్వార్టర్స్‌లో వుండగానే అయిపోయింది. అటునుంచి అటే ఒక ప్రత్యేక విమానంలో మాస్కో నగరానికి బట్వాడా చేయబడ్డాడు షాడో.

సోవియట్ మిలటరీ కాలేజీలో రెండు నెలలపాటు దాఋణమైన శిక్షణ యివ్వబడింది. అరవైమూడవ రోజున అర్థరాత్రి పన్నెండు గంటలకు బలవంతంగా నిద్రలేపి ఒక జెట్ విమానంలో కూర్చోబెట్టారు కాలేజీ అధికారులు. ఒక రివాల్వర్, వంద బుల్లెట్లు, డాగర్, ఒక పెద్ద హంటింగ్ నైఫ్‌ని చేతుల్లో పెట్టారు.

ఎక్కడికి పంపబడుతున్నాడో షాడోకు తెలియదు. కాలేజీ అధికారులు అతని ప్రశ్నలకు సమాధానం యివ్వటానికి నిరాకరించారు.

విమానాన్ని నడుపుతున్న పైలట్‌ని కదిలించి చూశాడు షాడో. అతను బిజీగా వున్నాడు కాబోలు _ షాడో మాటలను వినిపించుకోనేలేదు.

పదివేల అడుగుల ఎత్తుకు ఎగురుతున్నది విమానం. ఉన్నట్లుండి నేలకు వంద అడుగుల ఎత్తుకు డైవ్ చేసింది. అందుకు రెడీగా లేకపోవటంవల్ల పదిసార్లు పిల్లి మొగ్గలు వేశాడు షాడో. చేయి మెలికపడి బెణికింది. నుదురు సీటు మొనకు కొట్టుకొని నెత్తురు వెలువడింది.

"డామిట్! యూ బ్లడీ బగ్గర్..." అని కోపంగా లేచాడు షాడో.

మరుక్షణం అతని కాళ్ళకింద పెద్ద పగులు ప్రత్యక్షమయింది. విమానపు క్రింది భాగం రెండుగా విచ్చుకుంది. తల్లక్రిందులుగా పల్టీలు కొడుతూ పోయి పెద్ద బురద గుంటలో పడ్డాడు.

నడుములోతున వుంది బురద. అందువల్ల దెబ్బలు తగలలేదు. పడిన షాక్ నుంచి తేరుకొని పైకి చూశాడు. ఒకసారి అతను పడిన ప్రదేశం చుట్టూ రౌండ్ కొట్టి వెళ్ళి పోయింది విమానం. రెండు క్షణాల్లో దాని శబ్దం వినిపించకుండా పోయింది.

బురద గుంటలో నుంచి బయటికి వస్తూ జరుగుతున్నదేమిటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు షాడో.

అందుకు టైమ్ లేకపోయింది. బురద గుంటలో నుంచి యివతలికి వచ్చి నిటారుగా నిలబడేసరికి అతని తలమీది నుంచి దూసుకుపోయాయి రెండు బుల్లెట్లు. మరో నాలుగు అతని చుట్టూపడి దుమ్ము తెరలను సృష్టించాయి.

ఎగిరి పక్కనేవున్న పొదలచాటుకు దూకాడు షాడో.

కులకర్ణిగారు అన్న స్పెషల్ ట్రైనింగ్‌కి అర్థం ఏమిటో ఆ క్షణంనుంచీ తెలిసి రావటం ప్రారంభించింది.

కనిపించకుండా కాల్పులు జరుపుతున్నది _ మాస్కో మిలటరీ ట్రైనింగ్ కాలేజీ సిబ్బంది కాదు. వియత్నాం గెరిల్లాలు.

షాడోని వియత్నాంలో పడవేసి పోయింది ఆ విమానం.

చావు బ్రతుకులలో అనుక్షణం పోరాటం సల్పుతూ ఆ అడవుల్లోనుంచి బయటపడ్డాడు షాడో. వెంటనే వియత్నాం సైనికులు అతన్ని వెంటాడటం ప్రారంభించారు. గెరిల్లాలకు చెందిన మనిషి అని అనుమానించారు వారు.

ఆ రెండు పక్షాల మధ్యనుంచి ప్రాణాలతో బయటపడటానికి సరిగ్గా పద్దెనిమిది రోజులు పట్టింది.

వియత్నాం సరిహద్దు దాటేసరికి సి.ఐ.బి.కి చెందిన ఒక స్పెషల్ విమానం అతన్ని ఢిల్లీకి తీసుకువచ్చింది.

సి.ఐ.బి. హాస్పిటల్‌లో వారం రోజులు ట్రీట్‌మెంట్ యివ్వబడింది. నెలరోజులు లీవ్ గ్రాంట్ చేసి రెస్ట్ తీసుకోమని రికమెండ్ చేశారు హాస్పిటల్ అధికారులు.

వెంటనే ఢిల్లీకి పాతికమైళ్ళ దూరంలోవున్న సి.ఐ.బి. రెస్ట్ హౌస్‌కి వచ్చేశాడు షాడో. వచ్చి వారం రోజులు అయింది. తగిలిన గాయాలన్నీ మానుబట్టాయి. వియత్నాం అడవుల్లో ఉండే విషపుదోమలు అతని వీపును తూట్లుపొడిచి వదిలాయి. ఆ బాధ యింకా తగ్గలేదు. వత్తిడి కలిగితే ప్రాణం కడగట్టేబాధ!

“కాఫీ రెడీసార్!... నిద్రలేస్తారా?” అని కేక వేసింది బిందు.

ఆ మాటలతో షాడో ఆలోచనలు అంతమైపోయాయ్.

కాఫీ కప్పులతో ప్రత్యక్షమయింది బిందు.

ఆమెను చూడగానే షాడో మూడ్ సరి అయింది. హుషారుగా విజిల్ వేస్తూ కాఫీ కప్పునూ, ఆమె చేతిని రెంటినీ అందుకున్నాడు.

“డోన్ట్ బీ సిల్లీ రాజూ! మళ్ళీ వీపుమీది గాయాలు రేగుతాయి, ఆ తర్వాత మళ్ళీ హాస్పిటల్‌కి పోవాలి...” అంటూ అభ్యంతరం చెప్పింది బిందు.

ఒక్క గుక్కలో కప్పును ఖాళీచేసి బిందును కౌగిలిలో పొదువుకున్నాడు. రెండు క్షణాలు గింజుకున్నదామె. ఆ తర్వాత ఆ ప్రయత్నం విరమించుకున్నది.

అదే సమయంలో టీపాయ్ మీద టెలిఫోన్ వికృతంగా మోగింది.

ఎడమచేత్తో రిసీవర్‌ని అందుకున్నాడు షాడో.

“హల్లో రాజూ! స్టార్ట్ యిమ్మీడియెట్లి. బాస్ నీకోసం ఎదురు చూస్తున్నారు” అంటూ మృదువుగా వినవచ్చింది కులకర్ణిగారి సెక్రటరీ సులోచన కంఠం.

ఏమని సమాధానం యివ్వాలా అని ఆలోచించటం ప్రారంభించాడు షాడో.

“ఎందుకులే ఆ ఫోజు... కొత్తకాదుగా... బయల్దేరు” అంటూ కోపంగా లేచి కిచెన్‌లోకి వెళ్ళిపోయింది బిందు.

రెండు నిముషాల్లో డ్రసెప్ అయి బయటికి వచ్చాడు షాడో. గారేజిలో వున్న జాగ్వార్‌ని స్టార్ట్ చేసి ఢిల్లీ వైపు బయలుదేరాడు.

“హల్లో రాజూ! హౌ ఆర్ యూ మై బాయ్? ఆర్ యూ ఆల్ రైట్?” అంటూ ఆహ్వానించారు కులకర్ణి.

టేబుల్ ఎదురుగా వున్న కుషన్ ఛైర్‌లో కూర్చుని పనామా వెలిగించాడు షాడో.

“రాజూ! ఈ క్షణం నుంచీ నీ లీవ్ కాన్సిల్. ఇంకోపది నిముషాలలో మన సి.ఐ.డి. డైరెక్టర్ వస్తారు. అతనితో మాట్లాడిన మరుక్షణం నుంచీ యూ విల్ బి ఆన్ ఎ న్యూ ఎస్సైన్ మెంట్” అన్నారు కులకర్ణి.

పనామా పొగను గోడల మీదికి వదులుతూ తల వూపాడు షాడో.

రెండు నిముషాలు కూడా గడవకముందే ఆ గదిలోకి వచ్చాడు సి.ఐ.డి. డైరెక్టర్ పెర్నాండజ్.

షాడోతో కరచాలనం చేసి మరో కుషన్ ఛైర్ లో కూర్చున్నాడు.

పది నిముషాలపాటు గంభీరమైన నిశబ్దం రాజ్యమేలింది ఆ గదిలో.

ఉన్నట్లుండి గొంతు సవరించుకొని ఒక ఫ్రష్ సిగార్ వెలిగించారు కులకర్ణి. ఫెర్నాండేజ్ వైపుచూసి తల వూపారు.

కోటు జేబులో నుంచి ఒక అట్టపెట్టెను బయటికి తీశాడతను. జామెంట్రీ బాక్స్ సైజులోవుంది ఆ పెట్టె.

“రాజూ! మన సి.ఐ.బి. చీఫ్ యిన్‌స్పెక్టర్ సుదర్శన్ నీకు తెలుసు అనుకంటాను?” సడెన్ గా అడిగారు కులకర్ణి.

తల వూపాడు షాడో. మంచిపేరు సంపాదించిన సి.ఐ.డి అతను. వెరీ ఇంటలిజెంట్.

“రాజూ!... నెల రోజులక్రితం ఒక కేసును యిన్వెస్టిగేట్ చేయటానికి బాంబే వెళ్ళాడు సుదర్శన్.”

తల ఆడించాడు షాడో.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1876**

* * *

**Read other books of Madhu Babu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**